

స్పందనలో 72 వినతులు స్వీకరణ

- నలుగురు దివ్యాంగ విద్యార్థులకు లాప్‌టాప్‌లు పంపిణీ

-వార్త 6వ పేజీలో



స్పందన నిర్వహిస్తున్న కలెక్టర్ విజయసునీత, జేసీ భావన, ఐటీడీఏ పీవో అభిషేక్

సిరుల పంట జాఫ్రా



జాఫ్రా మొక్క (ఫైల్ ఫొటో)

స్వల్ప పెట్టుబడితో అధిక ఆదాయం

- రానున్న రోజుల్లో పెరగనున్న వినియోగం, గిరాకీ
- ప్రాంతీయ మార్కెట్‌లో కిలో రూ.170 కి కొనుగోలు

చింతపల్లి, మార్చి 1:

జాఫ్రా(అనోటా) సాగు గిరిజన రైతులకు సిరులు కురిపిస్తోంది. నామమాత్రం పెట్టుబడితో ఎక్కువ ఆదాయం తీసుకొస్తున్నది. గిరిజన ప్రాంతంలో రైతులు సాగు చేసే జాఫ్రాకు 'ఏ' గ్రేడ్ లభిస్తున్నట్టు శాస్త్రవేత్తలు అధ్యయనంలో వెల్లడైంది. ఔషధ గుణాలు, అధిక పోషకాలు కలిగిన జాఫ్రాకు జాతీయ, ప్రాంతీయ మార్కెట్‌లో మంచి ధర లభిస్తున్నది. ఈ ఏడాది జాఫ్రా గింజలను ప్రైవేటు వర్తకులు రికార్డు స్థాయిలో కిలో రూ.170 ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగం పెరుగుతుండడంతో రానున్న రోజుల్లో జాఫ్రాకు మంచి డిమాండ్ ఉంటుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.



జాఫ్రా గింజలు



ఎండిన జాఫ్రా కాయలు

దక్షిణ భారత దేశంలో జాఫ్రా(అనోటా) సాగుకి అల్లూరి సీతారామరాజు జిల్లా అత్యంత అనుకూలమని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు 25 ఏళ్ల కిందటే ప్రయోగాత్మకంగా గుర్తించారు. మెట్ట, పోడు భూముల్లో గంజాయికి ప్రత్యామ్నయంగా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు జాఫ్రా సాగు అత్యంత అనుకూలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గిరిజనులు చాలా ఏళ్ల నుంచి పంట పొలాల గట్లపై జాఫ్రా మొక్కలు పెంచుతూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ఎన్నో ఔషధగుణాలు కలిగిన జాఫ్రా మానవుల ఆరోగ్యానికి మేలుచేస్తుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులకు డిమాండ్ పెరగడంతో సహజసిద్ధ రంగును అందిస్తున్న జాఫ్రా గింజల వినియోగం పెరిగింది. దీంతో జాఫ్రా గింజలకు జాతీయ, ప్రాంతీయ మార్కెట్‌లలో గిరాకీ పెరిగి మంచి ధర లభిస్తున్నది. గిరిజన ప్రాంతంలో రైతులు సాగుచేసే జాఫ్రాకు 'ఏ' గ్రేడ్ లభిస్తోందని శాస్త్రవేత్తల అధ్యాయనంలో వెల్లడయ్యింది. ప్రాంతీయ మార్కెట్‌లో కిలో రూ.170కి వ్యాపారులు కొనుగోలు చేస్తుండగా, అంతర్జాతీయ

... మిగతా 6వ పేజీలో

జాఫ్రా విస్తృత వినియోగం



జాఫ్రా సహజసిద్ధమైన సిందూరం రంగు ఇస్తుంది. దీనిని ఐస్ క్రీమ్, మాంసాహారం, సుగంధద్రవ్యాలు, వెన్న, జున్ను, మిఠాయిలు, శీతల పానీయాలు, పప్పుధాన్యాలు, బియ్యంతో తయారుచేసే వంటకాలతోపాటు వస్త్రాలు, సౌందర్య పోషకాలు, సబ్బులు, చెప్పుల పాలిష్, నెయిల్ పాలిష్, హెయిర్ ఆయిల్స్‌లో వినియోగిస్తున్నారు.

- బురద దివ్య సుధ, గృహవిజ్ఞానశాస్త్రవేత్త, కేవీకే హరిపురం

కిలో రూ.170కి కొనుగోలు



జాఫ్రా సాగు చేసే ఆదివాసీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కిలో గింజలు రూ.170కి కొనుగోలు చేస్తున్నాం. జాఫ్రా సాగుపై ఆసక్తి కలిగిన రైతులకు నామమాత్రపు ధరకు మొక్కలు పంపిణీ చేస్తున్నాం. మొక్కలునాటిన తరువాత ఐదేళ్ల పాటు రైతులకు ఉచిత సాంకేతిక సహకారం అందిస్తాం. పండించిన జాఫ్రాకు మార్కెటింగ్ కోసం ధింసా ఆర్గానిక్ ఎఫ్‌పీవోను సంప్రదించవచ్చు. పూర్తి సమాచారం కోసం 79816 37171, 70133 02422 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

- వీఎస్‌జే ఆనంద్, మేనేజర్, ధింసా ఆర్గానిక్ ఎఫ్‌పీవో, చింతపల్లి

వాల్మీకి తెగపై సీఎం కక్ష

రాజకీయ స్వలాభం కోసం వెబ్‌సైట్ నుంచి తొలగింపు

- రాజ్యాంగ ధిక్కరణకు పాల్పడుతున్న జగన్‌రెడ్డి
- గిరిజన ఎంపీ, ఎమ్మెల్యేల బాధ్యరాహిత్యమే కారణం
- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్
- ప్రభుత్వ పోర్టల్‌లో వాల్మీకి తెగను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్

పాడేరురూరల్, మార్చి 1:

వాల్మీకి తెగపై సీఎం జగన్మోహన్‌రెడ్డి కక్షగట్టారని, రాజకీయ స్వలాభం కోసం ఆదివాసీలైన వాల్మీకి ఉపతెగను ఏపీ ప్రభుత్వ పోర్టల్ (వెబ్‌సైట్)లో తొలగించారని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ ఆరోపించారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, గతంలో కూడా ఇదే మాదిరిగా వాల్మీకి తెగను సచివాలయాల డీపీ లాగిన్‌లో తప్పించారన్నారు. 34 తెగల గిరిజన జాబితాలో వాల్మీకి తెగ ఆప్షన్ కనిపించడకుండా చేయడం చూస్తుంటే వాల్మీకులపై సీఎం జగన్మోహన్‌రెడ్డి కక్ష కట్టినట్టు స్పష్టమవుతున్నదన్నారు. వైసీపీకి దూరమైన గిరిజన ఉపతెగలను లొంగదీసుకొనేందుకే జాబితా నుంచి తొలగింపు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. గతంలో ఇదే మాదిరిగా భగత, వాల్మీకి, కమ్మర ఉపతెగలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో తొలగించారని గుర్తు చేశారు. అప్పట్లో పోరాటాలు చేయడంతో తిరిగి యధావిధిగా కొనసాగించారన్నారు.



సమావేశంలో మాట్లాతున్న గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

గిరిజన ప్రాంత ఎంపీ, ఎమ్మెల్యేలు బాధ్యతారాహిత్యం కారణంగా ఆదివాసీలు ఇబ్బందులు ఎదురవుతున్నారని బాలదేవ్ అన్నారు. ఒక తెగను తొలగించే, కొత్తగా మరో తెగను జాబితాలో చేర్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ అధికారం రాష్ట్రపతికి, పార్లమెంటుకు మాత్రమే వుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాజ్యాంగ ధిక్కరణకు పాల్పడుతున్నదని ఆయన ఆరోపించారు. వాల్మీకి ఉప కులాన్ని వెబ్‌సైట్ నుంచి తొలగించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.జగన్‌రెడ్డి ఇప్పటికైనా తీరుమార్చుకొని ప్రభుత్వ పోర్టల్‌లో వాల్మీకి తెగ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు చిట్టిబాబు, నరేశ్ పాల్గొన్నారు.

గిరిజన తెగల మధ్య చిచ్చుపెట్టేందుకు వైసీపీ ప్రభుత్వం కుట్ర




సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధనుంజయ్

చింతపల్లి, మార్చి 1: గ్రామ సచివాలయాల ఆన్‌లైన్ కుల ధ్రువీకరణ దరఖాస్తు వెబ్‌సైట్‌లో వాల్మీకి ఉపతెగను వారం రోజుల కిందట తొలగించారని, ఆదివాసీ తెగల మధ్య చిచ్చుపెట్టేందుకు వైసీపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సుమారు ఏడాదిన్నర కిందట భగత, వాల్మీకి, కమ్మర ఉప కులాలను గ్రామ సచివాలయం వెబ్‌సైట్ నుంచి తొలగించారని, దీంతో ఆదివాసీలు ఆందోళనలు చేపట్టడంతో పునరుద్ధరించారన్నారు. ఇప్పుడు సచివాలయం వెబ్‌సైట్‌లో వాల్మీకి ఉప తెగను తొలగించడం వెనక వైసీపీ పెద్దల కుట్రదాగి వున్నదన్నారు. దీంతో వారం రోజుల నుంచి సచివాలయాల్లో కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని చెప్పారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులు మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో వైసీపీ ప్రభుత్వం గిరిజన ఉప తెగల మధ్య విభేదాలు సృష్టించి లాభపడాలని ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు. సమావేశంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, నాయకుడు మజ్జి రాంబాబు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు 8న పాడేరు రాక

- 'ప్రజాగళం' పేరిట పలు సంఘాల నేతలతో ముఖాముఖీ
- వేదిక ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



పాడేరు, మార్చి1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 8వ తేదీన పాడేరు రానున్నారు. వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలతో ఇబ్బందులు పడుతున్న, సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగ సంఘాలతోపాటు ఇతరులతో 'ప్రజాగళం' పేరిట ఆయన ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వైసీపీ పాలనలో అవస్థలు పడుతున్న ప్రతి వ్యవస్థకు సంబంధించిన పెద్దలు, సంఘాల నేతలు స్వయంగా కలిసి తమ సమస్యలు చెప్పుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్లే మార్గంలో ఎస్పీ కార్యాలయానికి ఎదురుగా వున్న ప్రదేశాన్ని శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పరిశీలించారు. ప్రజాగళం పర్యవేక్షణ బృందం ఆమోదంతో సోమవారం నుంచి ఏర్పాట్లు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సోమెలి చిట్టిబాబు, గంగపూజారి శివకుమార్, డప్పోడి వెంకటరమణ, కూడి రామునాయుడు, బుక్కా జగదీశ్, జ్యోతికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 7,191 మంది విద్యార్థులు హాజరు

పాడేరు, మార్చి1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు తొలి రోజైన శుక్రవారం 7,191 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలోని 22 మండలాల్లో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫస్టియర్ తెలుగు/ హిందీ/ సంస్కృతం సబ్జెక్టులకు 7,759 మంది హాజరుకావాల్సి ఉండగా 7,191 మంది హాజరయ్యారు. 568 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో తొలి ఎక్కడా కాపీయింగ్, డీబార్ వంటి ఘటనలు చోటు చేసుకోలేదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పి.అప్పలరాము తెలిపారు.

← పాడేరులోని ఒక కేంద్రంలో పరీక్షకు హాజరైన విద్యార్థినులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- కుందిగుడ వద్ద ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ

అరకులోయ, మార్చి 1:



మృతిచెందిన పాంగి రాజు

మండలంలోని తడక-ఇరగాయి రహదారిలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గన్నెల పంచాయతీ తడక గ్రామానికి చెందిన పాంగి రాజు(31) బైక్‌పై సొంత పనిమీద ఇనగాయి గ్రామానికి వెళ్లాడు. ఉదయం పది గంటల సమయంలో తిరిగి వస్తుండగా కుందిగుడ గ్రామ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నది. దీంతో పాంగి రాజు కిందపడిపోయే క్రమంలో తల రోడ్డుకు బలంగా తగిలింది. దీంతో తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతడిని ఢీకొన్న వ్యక్తులు బైక్‌తోసహా పరారు కావడంతో నిందితులను గుర్తించలేకపోయారు. మృతిచెందిన రాజుకు భార్య, ఐదుగురు పిల్లలు వున్నారు.

ఆత్మీయ పలకరింపు

మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమం

- రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, మునగపాక మండలాల్లో 11 కుటుంబాలకు పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- పార్టీ అండగా ఉంటుందని భరోసా



మునగపాక మండలం గవర్ల అనకాపల్లిలో ముత్తుర్తి వెంకటరావు భార్యకు రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి పర్యటనకు జిల్లా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా తొలిసారి జిల్లాకు వచ్చిన ఆమెకు టీడీపీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజులపాటు అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గత ఏడాది చంద్రబాబు అరెస్టుతో మనస్తాపం చెంది ప్రాణాలు వదిలిన 11 మంది టీడీపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం చెక్కులు అందించారు. బాధిత కుటుంబాలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గురువారం ఉదయం చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలో ప్రారంభించిన పర్యటన శుక్రవారం మధ్యాహ్నం ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలంలో ముగిసింది.

చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలం కొవ్వూరులో నారా భువనేశ్వరిని చూసేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు, టీడీపీ శ్రేణులు తరలివచ్చారు. జై తెలుగుదేశం, జై చంద్రబాబు, సైకో పోవాలి... సైకిల్ రావాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. తనను చూడానికి వచ్చిన టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కొవ్వూరు పర్యటన ముగించుకొని ముందుకు సాగుతుండగా దారిలో రోలుగుంట శివారు చెరువులో మట్టి పనులు చేస్తున్న ఉపాధి పథకం కూలీలు రోడ్డుపైకి వచ్చి భువనేశ్వరిని కలిసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రోలుగుంట మండలం కొవ్వూరు, బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం గ్రామాల్లో పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడుతూ, కష్టకాలంలో కార్యకర్తలకు టీడీపీ అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, మన పిల్లల భవిష్యత్తు కోసం చంద్రబాబు నాయకత్వం అవసరమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపైనా వుందని అన్నారు. మునగపాక మండలం కాకరాపల్లిలో వాసా అప్పారావు కుమార్తె సునీతను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. భువనేశ్వర పర్యటనలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు బత్తుల తాతయ్యబాబు (చోడవరం), పీలా గోవింద సత్యనారాయణ (అనకాపల్లి), ప్రగడ నాగేశ్వరరావు (ఎలమంచిలి), పీవీజీ కుమార్ (మాడుగుల), మాజీ ఎమ్మెల్యేలు రామానాయుడు, కేఎస్ఎన్ఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, సీనియర్ నాయకులు, కోట్ని బాలాజీ, దాడి రత్నాకర్, ఆడారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మునగపాక మండలం తోటాడలో పెంటకోట వెంకటరమణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నారా భువనేశ్వరి

ఎర్రగెడ్డ ఆదివాసీలకు రెండు నెలలుగా అందని రేషన్

- జనవరి నుంచి బియ్యం పంపిణీ చేయని ఎండీయూ వ్యాన్ ఆపరేటర్
- అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన



రేషన్ కార్డులు చూపిస్తున్న ఎర్రగెడ్డ గిరిజనులు

గూడెంకొత్తవీధి, మార్చి 1: మండలంలోని దేవరాపల్లి పంచాయతీ ఎర్రగెడ్డ గ్రామానికి చెందిన ఆదివాసీలకు రెండు నెలలుగా రేషన్ బియ్యం అందడంలేదు. ఈ విషయాన్ని అధికారుకు, వైసీపీ ప్రజాప్రతినిధులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. రేషన్ బియ్యం పంపిణీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. శుక్రవారం రేషన్ కార్డులతో గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు చెప్పిన సమాచారం ప్రకారం.. ఎర్రగెడ్డ గ్రామంలో 55 ఆదివాసీ కుటుంబాలు నివాసం వుంటున్నాయి. గతంలో లక్కవరం డీఆర్ డిపో నుంచి రేషన్ సరుకులు తీసుకునేవారు. తరువాత మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ వ్యాన్లు) ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఎండీయూ ఆపరేటర్ డిసెంబరు వరకు సక్రమంగానే బియ్యం పంపిణీ చేశాడు. జనవరి నుంచి ఎండీయూ వ్యాన్ రావడంలేదు. కారణం ఏమిటో తెలియదని, ఈ విషయాన్ని వైసీపీ ప్రజాప్రతినిధులు, మండల రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదని ఎర్రగెడ్డ గిరిజనులు వాపోయారు. రేషన్ బియ్యం పంపిణీ చేయకపోవడం వల్ల ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తున్నదని, దీనివల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఈ నెల నుంచైనా రేషన్ బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రైం... crime news

మద్యం మత్తులో భర్త దారుణం

- భార్యతో తరచూ గొడవలు
- అర్ధరాత్రి నిద్రిస్తుండగా కుటుంబంపై పెట్రోల్ పోసి, నిప్పు
- కాలిన గాయాలతో ఆస్పత్రిలో ముగ్గురు చేరిక
- పోలీసుల అదుపులో నిందితుడు


కాలిన గాయాలతో భార్య విజయ్

మాకవరపాలెం, మార్చి 1 : భార్య భర్త మధ్య జరిగిన గొడవ కుటుంబ సభ్యులపై పెట్రోల్ పోసి, నిప్పంటించే స్థితికి తీసుకు వెళ్లింది. మాకవరపాలెం మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. రాచపల్లికి చెందిన తంగళ్ల రమణ, అతని భార్య విజయ్‌లకు గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. లారీ డ్రైవర్‌గా పని చేసే రమణ విధుల అనంతరం ఇంటికి వచ్చినప్పుడల్లా భార్యతో గొడవ పడేవాడని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. అయితే మూడు రోజుల కిందట ఇదే క్రమంలో భార్యతో గొడవకు దిగాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లిపోతున్నానని చెప్పిన రమణ బయటకు వచ్చేశారు. గ్రామంలో మద్యం సేవించి, రాత్రి 11 గంటల సమయంలో మద్యం మత్తులో తిరిగి ఇంటికి వెళ్లాడు. అప్పటికే అతని భార్య విజయ్, పదకొండు సంవత్సరాల కుమార్తె శ్రీకావ్య, అతని అత్త రావాడ కృష్ణమ్మ ఇంట్లో ఒకేచోట నిద్రిస్తున్నారు. గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ ముగ్గురిపై పెట్రోల్ పోసి తగులబెట్టే ప్రయత్నం చేశాడు. పెట్రోల్ ఒంటిపై పోసి, ఆ వెంటనే నిప్పు అంటించడంతో ఒక్కసారిగా భార్య ఉలిక్కిపడి లేచి కేకలు వేసింది. దీంతో చుట్టపక్కల ఉన్నవారు వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే కుమార్తె ఒంటి నిండా కాలిన గాయాలు అయ్యాయి. అలాగే అతని భార్యతో పాటు అత్తకు కూడా కొన్ని చోట్ల కాలిపోయింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి గాయాలపాలైన ముగ్గురినీ 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. భార్య విజయ్ ఫిర్యాదు మేరకు భర్త రమణపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


చింతపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ కాశీబాబు

చింతపల్లి, మార్చి 1: మండలంలోని కొమ్మంగి ఘాట్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. లోతుగెడ్డ గ్రామానికి చెందిన డ్రైవర్ సిరికి కాశీబాబు సర్వీసు ఆటోలో శుక్రవారం లోతుగెడ్డ జంక్షన్ నుంచి కొమ్మంగి ప్రయాణమయ్యాడు. ప్రయాణికులను కొమ్మంగి ఘాట్ రోడ్డు ముందు గ్రామంలో దించేసి, ఒక్కడే వాహనంలో వెళ్తున్నాడు. కొంత దూరం వెళ్లాక అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. ఆటో కింద పడిపోయి ఉన్న కాశీబాబును సుమారు రెండు గంటల తరువాత అటుగా వస్తున్న మరో ఆటో డ్రైవర్ బయటకు తీసి చింతపల్లి ఆస్పత్రికి తీసుకొచ్చాడు. క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అనంతరం స్థానిక వైద్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ జైలు శిక్ష

విశాఖపట్నం (లీగల్) మార్చి 1: హత్యానేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి లాలం శ్రీధర్ శుక్రవారం తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతానికి చెందిన నిందితులు ఆదినారాయణ, శ్రీను, మోహన్‌కుమార్ చెడువ్యసనాలకు బానిసలై పూటుగా మద్యం సేవిస్తూ గొడవలకు దిగుతుంటారు. పోలీసులు గతంలో వీరిపై రౌడీషీట్లు కూడా తెరిచారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఆగస్టు 19న వీరు ఆరిలోవలో మద్యం సేవిస్తూ గొడవపడి వినయ్ అనే వ్యక్తిని హత్యచేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆ సమయంలోనే ఆదినారాయణ చనిపోయాడు. మిగిలిన ఇద్దరిపై చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రూ.2 వేల చొప్పున జరిమానా కూడా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

విశాఖపట్నం, మార్చి 1: బాలిక (10) పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని దువ్వాడ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ ఎర్రన్నాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెదగంట్యాడ మండలానికి చెందిన బాలిక శుక్రవారం ఆడుకుంటుండగా అదే మండలానికి చెందిన తోహిదు షేక్ (30) ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో భయపడిన బాలిక తన తల్లి వద్దకు వెళ్లి విషయం చెప్పింది. దీంతో ఆమె దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడ్ని దిశ పోలీసులకు అప్పగించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, మార్చి 1: గురుకుల పాఠశాలలు, జూనియరు, డిగ్రీ కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని భీమిలి ఏపీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ కోడి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 38 గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నా రన్నారు. అలాగే ఏపీఆర్‌జేసీ సెట్ ద్వారా ఏడు గురుకుల జూనియరు కళాశాలలు నాగార్జునసాగర్ వద్ద ఉన్న డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు https://aprs.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈనెలాఖరు వరకూ దరఖాస్తులకు గడువు ఉందన్నారు. కాగా 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష ఏప్రిల్ 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశపరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 12 మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8 తరగతుల్లో మిగిలి వున్న ఖాళీల భర్తీకి, జూనియరు కళాశాలల్లోనూ మైనారిటీ కోటా సీట్లు ప్రవేశాలకు అర్హులైన వారు పరీక్ష రాయనవసరం లేదన్నారు. వారు నేరుగా మే 1 నుంచి ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి నేరుగా ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

విశాఖ- పలాస ప్రత్యేక పాసింజర్ రైళ్లు బ్రహ్మపూర్ వరకు పొడిగింపు

విశాఖపట్నం, మార్చి 1: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, పలాస మధ్య రాకపోకలు సాగిస్తున్న 08532, 08531 నంబర్లు గల ప్రత్యేక పాసింజర్ రైళ్లను వయా సోంపేట, ఇచ్ఛాపురం మీదుగా బ్రహ్మపూర్ వరకు పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-బ్రహ్మపూర్ ప్రత్యేక పాసింజర్ (08532) రైలు ఈనెల మూడు నుంచి ప్రతిరోజు సాయంత్రం 5.45 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 11.10 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08531) రైలు ఈనెల నాలుగు నుంచి ప్రతిరోజు తెల్లవారుజాము 3.50 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి 9.20 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు ఇరువైపులా మందస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

పాత సోముదేవుపల్లి, కొత్త సోముదేవుపల్లి వద్ద యథేచ్ఛగా ఇసుక అక్రమ వ్యాపారం

- బస్తాల్లో విక్రయాలు సాగిస్తున్న వైనం
- మినీ వ్యాన్, ఆటోలతో కూడా రవాణా
- పట్టించుకోని నియంత్రణ శాఖల అధికారులు


కొత్త సోముదేవుపల్లి వద్ద నదిలో ఇసుక అక్రమంగా తవ్విన ప్రదేశం


కొత్త సోముదేవుపల్లి సమీపంలో వరహానది గట్టు పక్కనే ఉన్న ఇసుక బస్తాలు

ఎస్.రాయవరం, మార్చి1: మండలంలోని పాత సోముదేవుపల్లి, కొత్త సోముదేవుపల్లి గ్రామాల సమీపంలో ఉన్న వరహానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ రెండు గ్రామాలకు చెందిన పలువురు వరహానదిలో రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు చేసి ఖాళీ గోనె సంచుల్లో నింపి బస్తా ఇసుక రూ.20చొప్పున విక్రయిస్తున్నారు. ఈ ఇసుక బస్తాలను చుట్టుపక్కల గ్రామాల్లో రూ.50 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడికక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టడం వలన వరహానదిలో ఎక్కడ చూసినా ప్రమాదకరమైన గోతులు దర్శనమిస్తున్నాయి. పట్ట పగలు ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా నియంత్రణ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ తవ్వకాలపై గత ఏడాది జూలై నెలలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన 'వరహా నదికి తూట్లు' వార్తకు స్పందించిన రెవెన్యూ అధికారులు కొద్ది రోజులు మాత్రమే ఆ గ్రామాల్లో ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టగలిగారు. ఇప్పటికైన వరహానదిలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.


నిల్వ చేసి ఉంచిన ఇసుక బస్తాలను మినీ వ్యాన్‌కు లోడ్ చేస్తున్న దృశ్యం

విద్యాదీవెనలో 39,773 మందికి లబ్ధి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


నమూనా చెక్కును విద్యార్థుల తల్లులు, విద్యార్థులకు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 1: జిల్లాలో విద్యాదీవెన పథకంలో 39,773 మంది విద్యార్థులకు రూ.26.54 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేసినట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక కారణాలతో పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యాదీవెన పథకం ప్రవేశపెట్టిందన్నారు. అంతకుముందు కృష్ణా జిల్లా పామర్రు నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి విద్యాదీవెన పథకం ప్రారంభించగా.. ఆ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్, వివిధశాఖల అధికారులు, లబ్ధిదారులు వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు. అనంతరం నమూనా చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ రాజేశ్వరి, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా సూర్యనారాయణరాజు ప్రమాణస్వీకారం


చాంబర్‌లో తొలిసారిగా మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

కోటవురట్ల, మార్చి 1: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు శుక్రవారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, వైసీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, సాగి రామచంద్రరాజు, కిల్లాడ శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు కోటవురట్ల, నాతవరం, మాకవరపాలెం, నర్సీపట్నం మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు డీవీ సూర్యనారాయణరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో కీలకమైన పదవిని అప్పగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

వైసీపీ విముక్త ఏపీయే లక్ష్యం కావాలి

- జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు


వైసీపీని వీడి జనసేనలో చేరిన వారితో పీవీఎస్ఎన్ రాజు

బుచ్చెయ్యపేట, మార్చి 1: వైసీపీ విముక్తి ఏపీయే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పిలుపు నిచ్చారు. మండలంలోని వడ్డాదిలో శుక్రవారం పార్టీ మండల కార్యదర్శి సయ్యపురెడ్డి నవీన్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకుడు రసూల్ తన 50 మంది అనుయాయులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. వీరికి రాజు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అవినీతి, నియంత పాలనతో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. టీడీపీ పాలనలో 5.5 లక్షల టన్నుల క్రషింగ్ చేసిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ, ప్రస్తుత వైసీపీ పాలనలో లక్షన్నర టన్నులు క్రషింగ్‌కే అపోసోపాలు పడాల్సిన దుస్థితి దాపురించిందని విమర్శించారు. వడ్డాదిలో కస్పా గ్రోయిన్, పెద్దేరుపై వంతెన, విజయరామరాజుపేట వంతెన, రహదార్ల అభివృద్ధికి టీడీపీ, జనసేన కూటమి కట్టుబడి ఉందన్నారు. టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా అంతా పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు అడపా నర్సింహమూర్తి, గునూరు మూలునాయుడు, అల్లం రామ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న కేశఖండనశాలలో ఊడిపడ్డ పైకప్పు పెచ్చులు



ఊడిపడ్డ శ్లాబ్ పెచ్చులు.... పెచ్చులూడిన పైకప్పు

సింహాచలం, మార్చి 1: సింహాచలం దేవస్థానానికి చెందిన కేశఖండనశాలలో శుక్రవారం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. అయితే ఆ సమయంలో అక్కడ భక్తులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 11 గంటల సమయంలో కేశఖండనశాలలో కొందరు భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నారు. అదే సమయంలో భవనం తూర్పు వైపు పైభాగంలో పెచ్చులూడిపడ్డాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఈఓ శ్రీనివాసమూర్తి ఆ ప్రాంతాన్ని పరిశీలించి, తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కాగా, కేశఖండనశాల భవనానికి 1986లో శంకుస్థాపన చేయగా 1987లో అప్పటి అనువంశిక ధర్మకర్త డాక్టర్ పీవీజీ రాజు ప్రారంభించారు. సుమారు ఏడాది క్రితం కొండపై అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన దేవదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం సీఈ కేశఖండనశాల భవనాన్ని పరిశీలించి ప్రమాదకరంగా ఉందని, తక్షణం కూల్చివేయాల్సిందిగా చెప్పారు. కానీ దేవస్థానం అధికారులు పట్టించుకోలేదు. శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో క్షురకులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు.

అంతర్ పంటలతో అదనపు ఆదాయం

- బుచ్చెయ్యపేట మండలంలో ఆయిల్ పామ్, కొబ్బరి తోటల్లో సాగు
- వాటర్ మిలన్, అపరాల పంటలు పండిస్తున్న రైతులు
- లాభదాయకంగా ఉందని పలువురు ఆనందం


చినఅప్పన్నపాలెంలో కొబ్బరి మొక్కల తోటలో సాగులో ఉన్న వాటర్‌మెలన్

బుచ్చెయ్యపేట, మార్చి 1: మండలంలోని పలువురు రైతులు వరి పంటతో పాటు ఇతర పంటలవైపు కూడా దృష్టి సారిస్తున్నారు. ఒకే పంటను నమ్ముకోకుండా అంతర పంటల సాగు ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఆయిల్ పామ్, కొబ్బరి తోటల్లో ఇతర పంటలను సాగు చేస్తూ లాభాలను పొందుతున్నారు. ఆయిల్ పామ్, కొబ్బరి సాగు అన్ని కాలాలకు అనుకూలం. తక్కువ పెట్టుబడితో ఆయిల్ పామ్ అయితే 30 ఏళ్ల, కొబ్బరి అయితే 60 ఏళ్లు వరకూ స్థిరమైన ఆదాయం ఉంటుంది. ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి ద్వారా నికరంగా రూ.లక్ష దాకా సంపాదించవచ్చు. అయితే పంట వేసిన నాలుగేళ్ల తర్వాతే దిగుబడి ఆరంభమవుతుంది. ఈ నైపథ్యంలో మొదటి మూడేళ్ల పాటు అంతర పంటలను సాగుచేయడం వల్ల అధిక లాభాలను ఆర్జించవచ్చు. బుచ్చెయ్యపేట మండలంలోని లోపూడి, బంగారుమెట్ట, పొట్టిదొరపాలెం, కొండెంపూడి, వడ్డాది, చినఅప్పన్నపాలెం, ఎల్‌బీపీ అగ్రహారం, పి.భీమవరం, కోమళ్లపూడి తదితర గ్రామాల్లో ఆయిల్ పామ్ తోటల్లో పుచ్చకాయ పంట (వాటర్ మిలన్)తోపా కూరగాయలు, అపరాలు సాగు చేస్తున్నారు. దీని ద్వారా ఎకరాకు రూ.20 వేలు అదనపు ఆదాయం వస్తుందని బంగారుమెట్టకు చెందిన రైతు సాయం సత్యనారాయణ తెలిపారు.


బంగారుమెట్టలో ఆయిల్ ఫామ్ మొక్క తోటలో పండిస్తున్న పుచ్చ పంట


అచ్యుతాపురంలో భువనేశ్వరిని కలిసిన టీడీపీ, జనసేన నాయకులు

భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ, జనసేన నాయకులు

అచ్యుతాపురం/ అనకాపల్లి టౌన్, మార్చి 1: నిజం గెలవాలి పర్యటనలో భాగంగా అచ్యుతాపురం వచ్చిన నారా భువనేశ్వరిని శుక్రవారం ఉదయం టీడీపీ, జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఆమె మునగపాక మండలంలో పలువురిని పరామర్శించి, రాత్రికి అచ్యుతాపురం పూడిమడక రోడ్డులో ఒక హోటల్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం టీడీపీ నాయకులు బండారు సత్యనారాయణ మూర్తి, దాడి వీరభద్రరావు, బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి నరసింగరావు, ధర్మిరెడ్డి నాయుడుబాబు, జనసేన నాయకుడు సుందరపు విజయకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అల్పాహారం తీసుకున్న తర్వాత తిరిగి మునగపాక మండలానికి వెళ్లారు.

పూడిమడక తీరంలో తాబేళ్ల కళేబరాలు

- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు


పూడిమడక తీరంలో కొట్టుకువచ్చిన తాబేళ్ల కళేబరాలు

అచ్యుతాపురం, మార్చి 1: పూడిమడక తీరంలో తాబేళ్ల మృతకళేబరాలు కొట్టుకు రావడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. పూడిమడక తీరంలో రెండు రోజుల నుంచి వరుసగా తాబేళ్ల మృతదేహాలు తీరానికి కొట్టుకువస్తున్నాయి. ఇటీవల అచ్యుతాపురం మండలం తంతడి శివారు వాడపాలెం తీరానికి కూడా తాబేళ్ల కళేబరాలు కొట్టుకువచ్చాయి. సాధారణంగా తాబేళ్లు చనిపోవు. సముద్రంలో భారీ షిప్‌ల కింద ప్రమాదవశాత్తు తగిలితేనే చనిపోతాయని, ఇది చాలా అరుదని మత్స్యకారులు తెలిపారు. గుడ్లుపెట్టే సమయంలో తీరానికి వచ్చినప్పుడు కూడా తాబేళ్లు చాలా అప్రమత్తంగా ఉంటాయని వారు తెలిపారు. కేవలం కర్మాగారాల కాలుష్యం వల్లే తాబేళ్లు చనిపోతున్నాయని వారంటున్నారు. పరవాడ వద్ద గల ఫార్మాసిటీ, అచ్యుతాపురం సెజ్‌లో కర్మాగారాల నుంచి విడుదలైన వ్యర్థాల కారణంగా తాబేళ్లు చనిపోతున్నాయని మత్స్యకార నాయకుడు చోడిపల్లి అప్పారావు ఆరోపించారు. ముత్యాలమ్మపాలెం, పూడిమడక, వాడపాలెం తీరాల్లో తాబేళ్లు చనిపోతున్నాయని ఆయన అన్నారు. వ్యర్థాల వల్ల మత్స్య సంపద కూడా నశించి మత్స్యకారులు చేపల వేట కూడా సక్రమంగా సాగటంలేదన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే మత్స్యకారుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఏప్రిల్ 25న గురుకుల విద్యాలయాల ప్రవేశపరీక్ష

- డీఈవో వెంకటలక్ష్మమ్మ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి రూరల్, మార్చి 1: ఏప్రిల్ 25వ తేదీన జరిగే ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె గురుకుల విద్యాలయాల సంస్థ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకులాలలో విలువలతో కూడిన విద్య, ఉచిత వసతి, సంరక్షణ, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఉన్నత పాఠశాల విద్యకు ఏపీఆర్ఎస్‌కేట్ (ఏపీఆర్‌జేసీఏటీ), ఇంటర్మీడియట్, డిగ్రీలకు ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ (ఏపీఆర్‌జే అండ్ డీసీ సీఈటీ) ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్షలు అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో తాటిపూడి ప్రిన్సిపాల్ డి.ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాంబ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు


ముంచంగిపుట్టు-కుమడ మార్గంలో తనిఖీల దృశ్యం

ముంచంగిపుట్టు, మార్చి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మండల కేంద్రం నుంచి కుమడ, లక్ష్మీపురం, పెదబయలు, జోలాపుట్టు తదితర ప్రాంతాల వైపు వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. రహదారులతో పాటు కల్వర్టులు, కాజ్‌వేలు, వంతెనల కింద, వాటి పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు బలగాలు స్థానిక నాలుగు రోడ్ల కూడలితో పాటు ప్రధాన జంక్షన్‌ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు గస్తీ నిర్వహిస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఎస్‌ఐ కోరారు.

గృహాల పేరుతో పేదలను అప్పుల పాల్జేసిన జగన్

» టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, మార్చి 1: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి గృహాల పేరుతో పేద ప్రజలను అప్పుల పాలు చేశాని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏడాదికి రూ.5 లక్షల చొప్పున ఐదేళ్లలో 25 లక్షల గృహాలను నిర్మించి పేదలకు ఉచితంగా అందిస్తానని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. తద్వారా మాట తప్పడం.. మడం తిప్పడం నా నైజమని నిరూపించుకున్నారన్నారు. ఉచితంగా ఇవ్వకపోగా గృహ నిర్మాణం పేరుతో పేద ప్రజలను అప్పులకు గురిచేశారన్నారు. గృహాలు నిర్మించుకోకుంటే పట్టాలను రద్దు చేస్తానంటూ బెదిరించి పేదలను అప్పుల పాలు చేసిన, టిడ్కో గృహాలను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు అప్పుతెచ్చిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు ఉచితంగా నిర్మించి పేదలకు ఇచ్చిన గృహాలకు ఓటీఎస్ పేరుతో జగన్‌రెడ్డి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేశారని మండిపడ్డారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 12 లక్షల నాణ్యమైన గృహ నిర్మాణాలు చేపట్టి పేదలకు అందించారన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులై వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబును గెలిపించేందుకు సిద్ధం కావాలని కోరారు.



టీడీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర... (ఇన్‌సెట్‌లో) విలేకరులతో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

జగన్‌రెడ్డికి బుద్ధి చెబుదాం... : సుబ్బారావు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అరాచక పాలనతో అధోగతి పాలుచేసిన జగన్‌రెడ్డికి బుద్ధి చెబుతామని టీడీపీనేత కొట్టగుళ్లి సుబ్బారావు పిలుపునిచ్చారు. గుత్తులపుట్టు పంచాయతీ సందబయలు, చీడిమెట్ట, దబ్బాపుట్టు, గోపాలపురం, తామరులు, వంతాల గుమ్మి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టిన అధికారంలోకి వచ్చిన జగన్ అరాచక పాలన సాగించారన్నారు. మాట తప్పను, మడం తిప్పను అంటూ ఊకదంపుడు కబుర్లతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు, చిరుద్యోగులను మోసగించారన్నారు. జగన్‌కు గుణపాఠం చెప్పేందుకు టీడీపీ, జనసేన ఒకటై ముందుకు వస్తున్నాయని, ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎం.మణికుమారి, నాయకులు బొర్రా విజయరాణి, ఎస్.బాబూరావు పడాల్, వర్తన పిన్నయ్యదొర, బొంజుపడాల్, రాజుబాబు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇస్తానని మోసగించిన జగన్: దొన్నుదొర

అరకులోయ: ఏడాదికి ఐదు లక్షల చొప్పున ఐదేళ్లలో 25 లక్షల ఇళ్లు నిర్మించి పేదలకు ఇస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చి మోసగించారని టీడీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. తన నివాసంలో పార్టీ నేతలతో కలిసి శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇళ్ల పట్టాలని పంపిణీ చేసి మూడేళ్లు గడిచిపోతున్నా ఒక్క ఇల్లు కూడా నిర్మించిన దాఖలాలు లేవని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పీఎంఏవై ఇళ్లను చూపించి తాను ఇచ్చినట్టు జగన్ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు హయాంలో ఇంటి నిర్మానానికి రెండు సెంట్లు ఇస్తే, నేడు జగన్‌రెడ్డి సెంటుకు కుదించారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, విద్యార్థులు, మహిళలు, రైతులకు ప్రోత్సాహం అందాలంటే టీడీపీ-జనసేన కూటమితో ఏర్పడే ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఆ దిశగా ప్రజలు ఆలోచించి కూటమిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ డుంబ్రిగుడ మాజీ అధ్యక్షుడు కొమ్ములునాయుడు, పెదలబుడు ఉప సర్పంచ్ చందూ విజయనిర్మల, టీడీపీ నాయకులు కిల్లో జగన్‌కుమార్, ఒలేక్ మోహన్‌దాసు, మోహన్ పాల్గొన్నారు.

తొలి రోజు పరీక్షకు 568 మంది గైర్హాజరు

పాడేరు రూరల్/చింతపల్లి/కొయ్యూరు/గూడెంకొత్తవీధి/ముంచంగిపుట్టు/హుకుంపేట/డుంబ్రిగుడ/పెదబయలు, మార్చి 1: జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు మొదటి రోజు 568 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అన్ని సబ్జెక్టులకు కలిపి మొత్తం 7,759 మంది హాజరు కావాల్సి ఉండగా, 7,191 మంది మాత్రమే వచ్చారు. జిల్లా కేంద్రం పాడేరులోని ప్రభుత్వ జూనియర్, ఏపీఆర్ కళాశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయంతో పాటు మరో ఐదు ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన జనరల్, ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు కళాశాలలో ఎ, బి (పరీక్ష కేంద్రాలు) సెక్షన్‌లను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. హాల్ టిక్కెట్ నంబర్లు పరిశీలించుకొని తరగతి గదుల్లోకి వెళ్లారు. ఏపీఆర్, కేజీబీవీ కళాశాలలకు చెందిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం పీటీడీ బస్సులో పరీక్ష కేంద్రానికి తరలించారు. విద్యార్థులను పోలీస్ సిబ్బంది ప్రధాన గేటు వద్ద తనిఖీ చేసి లోపలికి పంపించారు. జిల్లా కేంద్రం పాడేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఏపీఆర్ కళాశాల, కేజీబీవీ, ప్రథమ సంవత్సర పరీక్షలను జనరల్, ఒకేషనల్ గ్రూపులకు చెందిన 716 మంది హాజరు కావాల్సి ఉండగా 667 మంది హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు ఒకేషనల్ విద్యార్థులు 443 మందికి 406 మంది హాజరుకాగా 37 మంది గైర్హాజరయ్యారు. అలాగే జనరల్ విద్యార్థులు 273 మంది హాజరు కావాల్సి ఉండగా 261 మంది మాత్రమే హాజరుకాగా 12 మంది విద్యార్థులు రాలేదని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు.

చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 393 మంది విద్యార్థులకు 352 మంది హాజరయ్యారు. అలాగే గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో 232 మందికి 208 మంది పరీక్షలు రాశారు. టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌గా రామేశ్వరం, డీవోగా అనసూయ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌గా శివ కుమార్, డీవోగా అప్పారావు విధులు నిర్వహించారు. హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద తొలి రోజు పరీక్షకు 367 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 47 మంది రాలేదని అధికారులు తెలిపారు. కేంద్రం వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా 144 సెక్షన్ ఏర్పాటు చేశామని సీఐ నాయుడు తెలిపారు. కొయ్యూరు మండలంలోని కాకరపాడు గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. గురుకుల కళాశాలలో పరీక్షల నిర్వహణకు ఎనిమిది గదులను కేటాయించారు. తొమ్మిది మంది ఇన్విజిలేటర్లతో పాటు డిపార్టుమెంటల్ అధికారిగా చింతపల్లి ఏపీఆర్ కళాశాలకు చెందిన సీహెచ్.సత్యనారాయణ, చీఫ్‌గా స్థానిక కళాశాలకు చెందిన బీవీ రామకృష్ణ వ్యవహరిస్తున్నారు. మొదటి పరీక్షకు 160 మంది హాజరు కావల్సి ఉండగా 13 మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ పి.సూరిబాబు తెలిపారు.

ముంచంగిపుట్టు మండలంలో మొదటి రోజు 33 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజయ్యారని ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మొత్తం 304 మంది విద్యార్థులు పరీక్షలకు రావాల్సి ఉండగా, 271 మంది మాత్రమే హాజరయ్యారని, 33 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. విదార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టారు. ఆయన వెంట డీవో కిరణ్ ఉన్నారు. పెదబయలు మండలంలో మొత్తం 239 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా, 229 మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ తెలిపారు. గూడెంకొత్తవీధి టీడబ్ల్యూ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో స్థానిక విద్యార్థులతో పాటు కస్తూర్బా కళాశాల విద్యార్థినులు పరీక్షలు రాస్తున్నారు. డుంబ్రిగుడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేందాన్ని సీఐ రుద్రశేఖర్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఎస్ఐ సంతోష్‌కుమార్ ఉన్నారు.



పాడేరులో పరీక్షలకు హాజరై హాల్‌టిక్కెట్ నంబర్లు పరిశీలిస్తున్న విద్యార్థులు



లబ్ధిదారులతో కలిసి నమూనా చెక్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ విజయసునీత

జిల్లాలో 12,457 మందికి విద్యా దీవెన

» విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.6.15 కోట్ల జమ : జిల్లా కలెక్టర్

పాడేరు, మార్చి1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 12,457 మందికి విద్యా దీవెన లబ్ధి చేకూరిందని జిల్లా కలెక్టర్ విజయసునీత తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రులో శుక్రవారం బటన్ నొక్కి విద్యాదీవెన సొమ్మును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్న సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మొత్తం 12,457 మందికి విద్యాదీవెనలో భాగంగా రూ.6 కోట్ల 15 లక్షల 12 వేల 533 లబ్ధి చేకూరుతుందన్నారు. మొత్తం లబ్ధిదారుల్లో 10,327 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.4 కోట్ల 76 లక్షల 91 వేల 215లు, 339 మంది ఎస్సీ విద్యార్థుల రూ.2 కోట్ల 29 లక్షల 25 వేలు 94, బీసీ విద్యార్థులు 1,319 మందికి రూ..82 లక్షల 26 వేల499, ఈబీసీ విద్యార్థులు 127 మందికి రూ.11లక్షల 39 వేలు 425, కాపు విద్యార్థులు 282 మందికి రూ.3 కోట్ల 83 లక్షల 299 వారి తల్లుల ఖాతాల్లో జమవుతాయన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, వారి తల్లులతో కలిసి నమూనా చెక్‌ను కలెక్టర్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, ఎస్టీ కమిషన్ సభ్యులు జంపరంగి లిల్లీసురేశ్, గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ ఐ.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు



దిగువసొలములులో గిరిజనులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

పాడేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్‌మన్ యోజనలో భాగంగా ఏజెన్సీలో ఆదిమజాతి గిరిజనులకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లను అందిస్తున్నామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ చెప్పారు. మండలంలోని వర్తనాపల్లి, లగిశపల్లి పంచాయతీ కేంద్రాల్లో, ఇరడాపల్లి పంచాయతీ దిగువ సొలములు, ఎగువ సొలములు గ్రామాల్లో తూర్పువిద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆదిమజాతి గిరిజనులతో పీవో మాట్లాడి ఉచిత విద్యుత్ కనెక్షన్ల గురించి వివరించారు. అలాగే అర్హులైన లబ్ధిదారులందరికీ విద్యుత్ కనెక్షన్లను ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే పలు గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తుల మేరకు విద్యుత్ కనెక్షన్లను ఇస్తున్నామని, దిగువ సొలములులో 20 కనెక్షన్లను ఇచ్చామని, వర్తనాపల్లిలో నలుగు దరఖాస్తులు వచ్చాయని వాటికీ త్వరలోనే కనెక్షన్లు ఇస్తామని ఈపీడీసీఎల్ ఈఈ జి.సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు



గురుకుల కళాశాల పరీక్ష కేంద్రం వద్ద భద్రతను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ

చింతపల్లి, మార్చి 1: సబ్ డివిజన్ పరిధిలోని ఇంటర్మీడియట్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నామని అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ చెప్పారు. మండల కేంద్రంలో గురుకుల జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి, సీలేరు, జీకేవీధి, కొయ్యూరు ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాలపరిసర ప్రాంతాల్లో 144 సీఆర్‌పీసీ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుంపులుగా తిరగరాదన్నారు. పరీక్షా పేపర్లను తపాల శాఖలో పంపించే వరకు పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన కనీస సదుపాయాలు పాఠశాల యాజమాన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రమేశ్, చీఫ్ సూపరింటెండెంట్ రామేశ్వరం పాల్గొన్నారు.

స్పందనకు 72 వినతులు

» నలుగురు దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

పాడేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి గిరిజనుల నుంచి 72 వినతులు వచ్చాయి. వీటిని జిల్లా కలెక్టర్ విజయసునీత, జేసీ భావన వశిష్ట్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్వీకరించారు. పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ అంబీరుపాడు గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం మంజూరుచేయాలని గ్రామస్థులు కె.సూరనాయుడు, కె.చిన్నారావు కోరగా, హుకుంపేట మండలం మట్టుజోరు పంచాయతీ కుంతర్ల రహదారిలో రెండు కల్వర్టులను నిర్మించాలని సర్పంచ్ సీదరి సాంబ కోరారు. అలాగే అనంతగిరి మండలం బొర్రా పంచాయతీ బిత్రగెడ్డ, పెద్దూరు, బొడ్డపాడు, బలిపట్టు గ్రామాలకు రోడ్లు నిర్మించాలని సర్పంచ్ జన్ని అప్పారావు వినతిపత్రం సమర్పించారు. పెదబయలు మండలం పెదకోడాపల్లి గ్రామానికి చెక్‌డ్యామ్ మంజూరు చేయాలని పలువురు గిరిజనులు కోరారు. పాడేరు మండలం ఐనాడ పంచాయతీ రాయిపాలెం నుంచి గాతపనుకు గ్రామానికి రోడ్డు నిర్మించాలని సర్పంచ్ జె.బీమాలమ్మ కోరగా, హుకుంపేట మండలం జాంకరవలస నుంచి ఎగసల్తంగి మీదుగా సొంటారిపాడు గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఎంపీటీసీ సభ్యుడు మజ్జి హరి విన్నవించారు. ఇదిలా ఉండగా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నలుగురు దివ్యాంగ విద్యార్థులకు అధికారులు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి బి.పద్మావతి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్‌భాషా, గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, కె.వేణుగోపాల్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ కె.లావణ్యకుమార్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



స్పందన నిర్వహిస్తున్న కలెక్టర్ విజయసునీత, జేసీ భావన, పీవో అభిషేక్

అత్యాచార నిందితుడిని శిక్షించాలని ఆందోళన

అరకులోయ, మార్చి 1: మండలంలో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడ్ని శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన మహిళా సంఘం ప్రతినిధులు శుక్రవారం ఆందోళనకు దిగారు. మందుగా గిరిజన సంఘం కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ సోమేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు వివి.జయ మాట్లాడుతూ ఇంటి సమీపంలో బహిర్భూకి వెళ్లిన బాలికపై ఐటీఐ చదువుతున్న యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడని, అంగవైకల్యంతో ఉన్న బాలిక ఈ దుశ్చర్యను ఎదుర్కోలేకపోయిందని చెప్పారు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారని, తక్షణమే నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోక్సో, నిర్భయ చట్టాల కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే బాధిత బాలికకు సరైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన పోషకాహారం సరఫరా చేయాలని, నిరుపేదలైన తల్లిదండ్రులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చొంపి సర్పంచ్ కె.సుభద్ర, ఎంపీటీసీ సభ్యురాలు సోమెల జానకి, మహిళా, గిరిజన సంఘాల ప్రతినిధులు సన్యాసమ్మ, బుజ్జి, సిహెచ్.లక్ష్మీ, బుల్లమ్మ, మొత్తి, గ్రామ యువతులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సభ కోసం పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్లే మార్గంలో ఎస్పీ కార్యాలయానికి ఎదురుగా వున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, నాయకులు

-పాడేరు, ఆంధ్రజ్యోతి

సిరుల పంట జాఫ్రా

... 5వ పేజీ తరువాయి

మార్కెట్‌లో రూ.230-250 ధర పలుకుతున్నది. గిరిజన రైతులకు దీర్ఘకాలిక ఆదాయం సమకూరుస్తున్న జాఫ్రా సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేస్తున్నారు.

సాగు విధానం

జాఫ్రాను విత్తనాలుగా లేదా ముదురు కాండం కొమ్మలను నాటుకొని సాగు చేయవచ్చు. కొమ్మల కన్నా విత్తనాలు నాటుకోవడం మంచిది. మట్టి, సేంద్రీయ ఎరువు కలిపి పాలిథిన్ సంచుల్లో వేసుకోవాలి. ఒక్కో సంచిలో ఒక్కో విత్తనం వేసి నీరుచల్లాలి. ఎనిమిది నుంచి పదిహేను రోజుల్లో విత్తనాలు మొలకెత్తుతాయి. 90 రోజులు పెరిగిన తరువాత జూలై నుంచి అక్టోబరు మధ్యలో నాటుకోవచ్చు. మొక్కల మధ్య ఎటుచూసినా పది అడుగుల దూరం వుండేలా 30 ఘనపు సెంటీమీటర్ల గోతులు తీసి ఎకరాకు 500 మొక్కలను నాటుకోవాలి. మూడేళ్ల తరువాత కాపునకు వస్తాయి. జాఫ్రా మొక్కలను పశువులు తినవు. అదే విధంగా తెగుళ్ల బెడద కూడా వుండదు. ఒకవేళ ఏదైనా తెగులు సోకితే జీవరసాయన మందులు మాత్రమే ఉపయోగించాలి. రసాయన పురుగు మందులను పిచికారీ చేయకూడదు.

స్వల్ప పెట్టుబడి.. అధిక ఆదాయం

జాఫ్రా మొక్కలు నాటిన మూడో ఏట నుంచి కాపుకొస్తాయి. మొదటి ఏడాది మొక్కలు, గోతులు తీయడం, ఎరువులు, పొలం చుట్టూ కంచె వేయడానికి ఎకరానికి రూ.15 వేల వరకు ఖర్చుఅవుతుంది. రెండు, మూడు సంవత్సరాల్లో ఎరువుల కోసం రూ.3-4 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. నాలుగో ఏడాది నుంచి కాపుకొస్తాయి, రెండేళ్లపాటు కాపు నామమాత్రంగానే వుంటుంది. ఆరో ఏట నుంచి దిగుబడి క్రమంగా పెరుగుతుంది. గరిష్ఠంగా 22 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఏటా ఒక్కో మొక్క/ చెట్టు నుంచి రెండు కిలోల వరకు జాఫ్రా దిగుబడి వస్తుంది. ఖర్చులుపోను ఎకరానికి రూ.1.5 లక్షల ఆదాయం వస్తుంది.



పోడు భూముల్లో సాగు చేస్తున్న జాఫ్రా

జాఫ్రాలో అధిక ఔషధ గుణాలు

జాఫ్రాలో ఔషధ గుణాలు, పోషక విలువలు అధికంగా వున్నట్టు నిపుణుల అధ్యయనంలో వెల్లడయ్యింది. జాఫ్రా గింజల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే కెరోటినాయిడ్లు అధికంగా వున్నాయి. ఈ చెట్టు బెరడును ఆయుర్వేద వైద్యంలో గనేరియా వ్యాధి నివారణకు, వితనాల గుజ్జును బంకవిరేచనాలను అరికట్టేందుకు, ఆకులను పాముకాటు విషయం విరుగుడుకు, పచ్చకామెర్ల నివారణకు ఉపయోగిస్తుంటారు. అలాగే జాఫ్రా గింజలను వాడడం వల్ల క్యాన్సర్ సోకే అవకాశం లేదని వైద్యనిపుణులు ధ్రువీకరించాడంతో ప్రపంచ వ్యాప్తంగా జాఫ్రా వినియోగం పెరుగుతున్నది.

☛ సంక్షిప్తంగా..

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

పాడేరు రూరల్, మార్చి 1: రాష్ట్రంలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మండలంలో 549 మంది గృహాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా, 109 మందిని అర్హులుగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. స్థలాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయిందన్నారు. గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.8 లక్షలు సమకూర్చుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సాయినవీన్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు బాలురు పాఠశాల విద్యార్థికి అనారోగ్యం

జి.మాడుగుల, మార్చి 1: మండలంలోని కొత్తూరు బాలురు-2 ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పాలికి అనిల్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. గత నెల 25న పాఠశాల నుంచి సెలవు అనుమతి లేకుండా స్వగ్రామం చీకుబందలో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అనారోగ్యానికి గురైనట్టు శుక్రవారం పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందింది. దీంతో అంబులెన్స్ ద్వారా జి.మాడుగుల పీహెచ్‌సీకి తీసుకువచ్చి వైద్య సేవలు అందించారు. కాగా, విద్యార్థి కాలు, చేతులు పనిచేయలేదని సదరు పాఠశాల యాజమాన్యమే చెబుతున్నారు. అయితే ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1వ తేదీ మధ్యలో ఆరు రోజుల్లోనే కాలు, చేతులు పడిపోయే పరిస్థితులు వస్తాయా? అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై డాక్టర్ శశికాంత్‌కు ఫోన్లో సంప్రదించగా విద్యార్థి కాలు, రెండు చేతులు పనిచేయలేదని చెప్పారు. మెరుగైన వైద్య సేవల కోసం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

చింతపల్లి, మార్చి 1: ఆదివాసీలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సౌమ్య సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ఐటీడీఏ క్వార్టర్స్ ఆరోగ్య ఉప కేంద్రం వద్ద శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 112 మంది రోగులకు డాక్టర్ సౌమ్య వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలోకి ప్రవేశిస్తుండడంతో వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని, అశ్రద్ధ చేయకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. గర్భిణులు క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇస్లామియ ధార్మిక సభ

చింతపల్లి, మార్చి 1: మండల కేంద్రం మసీదులో శనివారం ఇస్లామియ ధార్మిక సభను ఏర్పాటు చేసినట్టు కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మసీదు పెద్దలు ఏర్పాటు చేసిన ఈ సభకు ఇస్లాం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రఫిక్, జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం ముఖ్య వక్తలుగా హాజరవుతారని చెప్పారు. చింతపల్లి, జీకే వీధి మండలాల ముస్లింలు సభను జయప్రదం చేయాలని కోరారు.

మాతృ భాష విద్యా వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి



దీక్షల్లో కూర్చొన్న మాతృ భాష విద్యా వలంటీర్లు

పాడేరు రూరల్, మార్చి 1: ఆదివాసీ మాతృ భాష విద్యా వలంటీర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.సుందరరావు డిమాండ్ చేశారు. వలంటీర్లను మార్చి, ఏప్రిల్ నెలల్లో విధుల్లో కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టి రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ప్రాథమిక విద్యపై ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. తక్షణమే విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీలోని 11 మండలాల వలంటీర్ల సంఘం నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా గిరిజన భవన్

కొయ్యూరు, మార్చి 1: మండల కేంద్రంలో రూ.25 లక్షలు వ్యయంతో నిర్మించిన గిరిజన భవన్ తుది మెరుగులు దిద్దుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. అరకు ఎంపీ మాధవి తన నిధుల నుంచి ఈ భవన నిర్మాణాలకు రూ.25 లక్షలు కేటాయించారు. గత ఏడాది నవంబరులో భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మూడు నెలల వ్యవధిలోనే గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో భవన నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతో కొన్ని దశాబ్దాలుగా కలగా మిగిలిన గిరిజన భవన్ ఎట్టకేలకు నిర్మాణాలు పూర్తి చేసుకుని అందుబాటులో వస్తతండడంతో గిరిజన ఉద్యోగుల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు నిధులు కేటాయించిన ఎంపీ మాధవికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలని మానవహారం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 1: పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో మానవహారం నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ పలు నినాదాలు చేస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.రాంబాబు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పని సరిగా పోలియో చుక్కలను వేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య స ఇబ్బంది సౌరి, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడ కూడలిలో మానవహారం చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది